క్లుప్తంగా

వన్య ప్రాణులను సంరక్షించండి

రావికమతం: వన్య ప్రాణులను వేటాడవద్దని చోడవరం డివిజన్ ఫారెస్ట్ రేంజర్ వర్మ తెలిపారు. అంతర్జాతీయ వన్య ప్రాణుల దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని చీమలపాడు పంచాయతీ బంగారుబంద గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల వల్ల ప్రకృతికి జరిగే మేలు గురించి వివరించారు. వివిధ కారణాల వల్ల అడవిలో అగ్ని ప్రమాదం సంభవిస్తే సంబంధిత సిబ్బందికి తెలియజేయాలన్నారు. అవకాశం ఉంటే మంటలను అదుపు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నేడు

దేవరాపల్లి: మండలంలోని కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ గంధం రామకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలను నిర్వహించి విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున అందజేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మహిళల కోలాటం, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పాడి పశువులకు బీమా

మాడుగుల రూరల్: విశాఖ డెయిరీ ద్వారా పాడి పశువులకు కె.జె.పురం పాల సొసైటీల వద్ద రెండు రోజులు పాటు పశువుల బీమా చేస్తామని స్థానిక సొసైటీ అధ్యక్షుడు యల్లపు వెంకట శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం కె.జె.పురం –1 సొసైటీ వద్ద బుధవారం 2వ పాల సొసైటీ వద్ద పాడి గేదెలు, ఆవులకు బీమా చేస్తారన్నారు.

బూరుగుపాలెంలో బోర్లు ఏర్పాటు



బోర్లు తవ్విస్తున్న దృశ్యం

మాకవరపాలెం: మండలంలోని బూరుగుపాలెంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా రెండు బోర్లు ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు లచ్చన్నపాలెంలో తాగునీటి ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేస్తారు. అయితే పైపులైన్ మరమ్మతులకు గురైతే బూరుగుపాలెం ప్రజలకు తాగునీరు అందడం లేదు. ఈ నేపథ్యంలో అలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ట్యాంకు పక్కనే సోమవారం రెండు బోర్లు తవ్వించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో ఈ బోర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు భీమిరెడ్డి గోవింద పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు అరెస్టు అన్యాయం



మాట్లాడుతున్న మండల కార్యదర్శి దేముడుబాబు

కె. కోటపాడు: నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి అరెస్టు అన్యాయమని పార్టీ మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు పేర్కొన్నారు. సోమవారం కె. కోటపాడులో ఆయన మాట్లాడుతూ ఎల్జీ పాలిమర్స్ ఘటనలో అస్వస్థతకు గురైన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారన్నారు. కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించారని బూచిగా చూపి సత్యనారాయణమూర్తిపై కేసులు నమోదు చేసి అరెస్టు చెయ్యడం అన్యాయమన్నారు. నాయకులు రెడ్డి అప్పలనాయుడు, పోంతపల్లి రామారావు, సీమసిరి సూర్యనారాయణ, రామునాయుడు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి దాతల సహకారం



సర్పంచ్‌కు విరాళం అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు మోదమాంబ ఆలయాభివృద్ధికి దాతలు సహకారం అందిస్తున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన జమ్ముల భీమునాయుడు, నాగేశ్వరరావు, రామచంద్రరావు దంపతులు రూ.10 వేలు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు సోమవారం అందజేశారు. ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, ఉప సర్పంచ్ గెంజి రాజేష్, పడాల అప్పలనాయుడు, రాయపురెడ్డి కొండలరావు, అర్చకుడు శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

కైలాస వాటికకు
కొత్త సొబగులు

- రూ.2.50 లక్షల జెడ్పీ నిధులతో అభివృద్ధి
- శ్మశానవాటిక చుట్టూ ఫెన్సింగ్ మెస్, ఐరన్ గేట్లు, సిమెంట్ ప్లాట్ ఫాం
- పాచిలవానిపాలెం గ్రామస్తుల హర్షం





తారురోడ్డు నుంచి శ్మశాన వాటికకు రెండేళ్ల క్రితం చేపట్టిన సిమెంట్ రోడ్డు

కె.కోటపాడు: పలు గ్రామాల్లో శ్మశాన వాటికల్లో అసౌకర్యాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంటాయి. అంతిమ యాత్ర నిర్వహించే సమయాల్లో అధ్వానంగా అపరిశుభ్రంగా దర్శనమివ్వడంతో ప్రజలు పడే ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటాయి. ఇందుకు భిన్నంగా మండలంలో పాచిలవానిపాలెం శ్మశాన వాటిక కొత్త సొబగులతో దర్శనమిస్తోంది. శ్మశాన వాటిక ఆక్రమణలకు గురికాకుండా చుట్టూ ప్రహరీ (ఫెన్సింగ్ మెస్)తో పాటు ప్రవేశానికి ఐరన్ గేట్లు, సిమెంట్ ప్లాట్ ఫాం ఏర్పాటు చేశారు. ఇక్కడ శ్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణతో కలిసి గ్రామస్తులు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె స్పందించి దీని అభివృద్ధి పనులకు రూ.2.50 లక్షలు మంజూరు చేసారు. ఈ నిధులతో పనులు పూర్తి కావడంతోపాటు స్థానికులు శ్మశాన వాటిక పరిసరాల్లో శివుని చిత్రాలను అందంగా వేయించారు.

రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

వైఎస్సార్‌సీపీ హయాంలో రెండేళ్ల క్రితం అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంజూరు చేసిన రూ.5 లక్షలతో తారురోడ్డు నుంచి శ్మశాన వాటికకు వెళ్లే 300 మీటర్ల మట్టిరోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించారు. అంతిమ యాత్ర సమయంలో వర్షాకాలంలో చెరువుని ఆనుకొన్న మట్టిరోడ్డులో నడిచే వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ సమస్యకు సీసీరోడ్డు నిర్మాణం ద్వారా పరిష్కారం లభించడంతోపాటు ప్రస్తుతం శ్మశాన వాటిక అభివృద్ధి పనులు పూర్తి కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్మశాన వాటికలో శివుని చిత్రం



పాచిలవానిపాలెంలో శ్మశాన వాటికకు ఏర్పాటు చేసిన ఐరన్ గేట్

అభివృద్ధికి పూర్తి సహకారం



మండలంలో అన్ని గ్రామాల్లోను జిల్లా పరిషత్ నిధులతో అభివృద్ధి జరిగేందుకు సహకరిస్తాను. ఇప్పటికే పలు గ్రామాల్లో జిల్లా పరిషత్ నిధులతో ఎస్సీ కాలనీల్లోను, అసంపూర్తి అంగన్వాడీ భవనాల నిర్మాణాలకు, మంచినీటి బోర్ల నిర్మాణాలకు నిధులను కేటాయించాను. పాచిలవానిపాలెం శ్మశానవాటికకు నిధులను మంజూరు చేశాను.

– ఈర్లె అనురాధ, జెడ్పీటీసీ, కె.కోటపాడు

జెడ్పీటీసీ అనురాధకు కృతజ్ఞతలు



గ్రామస్తులు శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపట్టుకోవాలని సంకల్పించారు. దీనికి రక్షణ గోడ, గేట్లు, చుట్టూ సిమెంట్ ప్లాట్ ఫారం నిర్మాణానికి జెడ్పీటీసీ నిధులను మంజూరు చేయాలని కోరాం. అడిగిన వెంటనే రూ.2.50 లక్షలను మంజూరు చేసారు. దీంతో 500 మీటర్ల ఫెన్సింగ్ మెస్, గేట్లు, సిమెంట్ ప్లాట్ ఫారం ఏర్పాటు చేశాం. నిధులను మంజూరు చేసి అభివృద్ధి పనులకు సహకరించిన జెడ్పీటీసీ అనురాధకు కృతజ్ఞతలు.

– రొంగలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ

ఆహారపు అలవాట్లతో మంచి ఆరోగ్యం



విద్యార్థినులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ

మాడుగుల రూరల్: ఆహారపు అలవాట్లలో మార్పుతోనే కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉంటారని మాడుగుల ఐసీడీఎస్ సీడీపీవో సిహెచ్ శ్రీదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కె.జె.పురం జెడ్పీ హైస్కూలులో సోమవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాలు గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఈశ్వరమ్మ, హెచ్‌ఎం వి.దాసు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

రావికమతం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మండలంలో దొండపూడి ,కొత్తకోట, మత్స్యవానిపాలెం తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, తల్లులకు సోమవారం అవగాహన కల్పించారు. మహిళలకు కల్పిస్తున్న రాజ్యాంగపరమైన హక్కులు, చట్టపరమైన హక్కులు గురించి వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

పార్టీ నేతకు మాజీ ఎమ్మెల్యే గణేష్ పరామర్శ



శ్రీనివాస్ ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నాతవరం: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ఉలబాల శ్రీనువాస్‌ను మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సోమవారం పరామర్శించారు. మండలంలో శృంగవరం సర్పంచ్ ఉలబాల యర్రయ్యమ్మ భర్త శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని స్వగ్రామం చేరుకున్నారు. ఈ మేరకు ఆయన్ను గణేష్ పరామర్శించి మనోధైర్యం కల్పించారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరించే శ్రీనివాస్ అనుకోకుండా అనారోగ్యానికి గురికావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ పైల సునీల్, పెదగొలుగొండపేట సర్పంచ్, పంచాయతీరాజ్ శాఖ విభాగం మండలాధ్యక్షుడు మిరపల వెంకటరమణ, గ్రామ కమిటీ నాయకుడు కొళ్ల రమణ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామారావు

బుచ్చెయ్యపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తారని ఎస్‌ఐ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా సోమవారం బుచ్చెయ్యపేట, దిబ్బిడి పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అదనపు ఎస్‌ఐ భాస్కరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు రాధ, అమ్మాజీ, లక్ష్మి పాల్గొన్నారు.

గొలుగొండ: బాలికలు స్వీయరక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సి.రామారావు సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జోగంపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలికలు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఈ పోటీలు ఏర్పాటు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని హెచ్‌ఎం అచ్యుతరామయ్య అన్నారు.

సంక్షేమం, అభివృద్ధిలో నిర్లక్ష్యం చేయొద్దు



అభివృద్ధి పనులు నమోదు చేస్తున్న ఎంపీడీవో ఉషశ్రీ

నాతవరం: మండల వ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులు విషయంలో క్షేత్రస్థాయిలో అధికారులంతా బాధ్యతగా పని చేయాలని ఎంపీడీవో కె.ఉషశ్రీ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులతో ఆమె సమీక్షించారు. పంచాయతీల వారీగా అప్పగించిన సర్వేలు వేగవంతం చేయాలన్నారు. అంకిత భావంతో పని చేయకపోతే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కొన్ని సచివాలయాల పరిధిలో సర్వే నివేదికలు చాలా దారుణంగా ఉన్నాయని, ఆయా పంచాయతీ కార్యదర్శులు పనితీరులో మార్పు రావాలన్నారు. లేకుంటే కలెక్టరు తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారన్నారు. వేసవి దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీరు సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ నెలాఖరులోగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారిథి, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్ ఖాన్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షీయాజ్ ఖాన్

నర్సీపట్నం: బాలికలపై జరుగుతున్న దుశ్చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు అనేక చట్టాలు ఉన్నాయని సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్ ఖాన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం చైల్డ్ మ్యారేజ్, గుడ్ టచ్...బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలను ఉద్దేశించి జడ్జి మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. చట్టాలపై కనీస అవగాహన ఉండాలన్నారు. పోక్సో చట్టం చాలా తీవ్రంగా ఉంటుందన్నారు. ఈ కేసులో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. బాల్య వివాహాలు ప్రోత్సహించకూడదన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారు శిక్షార్హులు అవుతారన్నారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారులపై కామాంధుల కళ్లు పడుతున్నాయని, చాలా సందర్భాల్లో తెలిసిన వారే దుశ్చర్యకు ఒడిగడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి బారిన పడకుండా మన పిల్లలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ చెప్పాలన్నారు. బాలికలపై లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో సీఐ గోవిందరావు, ఎల్.రేవతమ్మ, ఎంఈవో తలుపులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు



సోషల్ ఆడిట్‌పై సూచనలు చేస్తున్న ఎంపీడీవో ఉషశ్రీ

నాతవరం: ఉపాధి హామీ పథకంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేసిన పనులకుగాను 17వ విడత సోషల్ ఆడిట్ మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.ఉషశ్రీ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసే సిబ్బందికి అన్ని శాఖల అధికారులు పూర్తిగా సహకరించాలన్నారు. ఈ నెల 4 నుంచి 20వ తేదీ వరకు సోషల్ ఆడిట్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నారావు, పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మ, ఎస్ఆర్పీ నాగరాజు, టీసీ దేముడు, సిబ్బంది పాల్గొన్నారు.

సారా రహిత సమాజం కోసం కలసిరండి



నీలకంఠాపురంలో అవగాహన కల్పిస్తున్న సీఐ పాపునాయుడు

బుచ్చెయ్యపేట: సారా రహిత సమాజం ఏర్పాటు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎక్సైజ్ శాఖ సీఐ పాపునాయుడు తెలిపారు. సారా రహిత గ్రామాలుగా మార్పు కోసం నవోదయం 2.0లో భాగంగా సోమవారం రాత్రి బుచ్చెయ్యపేట శివారు పంచాయతీ నీలకంఠాపురం రామాలయం వద్ద గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సారా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వీటికి బానిసలుగా మారి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ముఖ్యంగా నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బంగారు జీవితాన్ని జైలు గోడలు మధ్య చీకట్లో మగ్గిపోకుండా చూసుకోవాలన్నారు. సారా నిర్మూలన గ్రామంగా మార్చేందుకు గ్రామస్తులు కలిసి రావాలన్నారు. సర్పంచ్ కంటే నాగభూషణం , మాజీ సర్పంచ్ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ అప్పారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గాదె గెలుపుపై హర్షం



ఆనందం వ్యక్తం చేస్తున్న పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అప్పారావు

రోలుగుంట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించడంతో మండల అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి. చంద్రశేఖర్‌రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బుద్దిగ అప్పారావు నృత్యాలు వేస్తూ తన ఆనందాన్ని తెలియజేశాడు. ఉపాధ్యాయ సమస్యలు తెలుసుకుని సున్నితంగా పరిష్కరించగల వ్యక్తి శ్రీనివాసులునాయుడు అని అన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

- 10 మంది విద్యార్థుల గైర్హాజరు

మాడుగుల రూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో తొలి రోజు 450 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పది మంది గైర్హాజరయ్యారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్. నీలిమ తెలిపారు. పరీక్షలకు మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల, వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల, వీఆర్ఆర్ పేట గాయత్రి కళాశాల, కేజీబీవీ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. కళాశాల పరిసరాల్లో ఎటువంటి సంఘటనలు చోటుచేసుకుండా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు.

ఆలయ మండప నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న భక్తులు

మాడుగుల: స్థానిక గాంధీ పార్కు వద్ద ఆంజనేయ స్వామి ఆలయం మండప నిర్మాణానికి కమిటీ సభ్యులు సోమవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ ఆలయ ముందు భాగం తొలగించి మండపం నిర్మాణం చేస్తామని ప్రధాన భక్తుడు రాఖీ శ్రీను తెలిపారు. ఈ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిటీ సభ్యులు కోరారు. భక్తులతో పాటు దాతలు ముందుకు వచ్చి స్వామివారి ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని కోరుతున్నారు.

‘ఉపాధి’ కల్పించాలని వేడుకోలు

మాకవరపాలెం: ఉపాధి పనులు కల్పించాలని మండలంలోని గిడుతూరు గ్రామస్తులు కోరుతున్నారు. ఈ గ్రామంలో వీఆర్పీ లేకపోవడంతో ఉపాధి పనులు చేపట్టలేదని స్థానికులు తెలిపారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని గ్రామాల్లోనూ పనులు ప్రారంభించారని, తమ గ్రామంలో ఇప్పటికీ పనులు జరగలేదన్నారు. ఇదే విషయమై ఉపాధి అధికారులను అడిగితే వీఆర్పీ లేకపోవడం, మేట్ల నియామకం కూడా జరగని కారణంగా పనులు ప్రారంభించలేదని సమాధానమిస్తున్నారన్నారు. గతంలో ఇక్కడ వీఆర్పీ లేకున్నా, వేరొక వీఆర్పీతో పనులు చేయించేవారని, ఇప్పుడు కూడా పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

జీడి పిక్కలను కొనుగోలు చేయాలని ధర్నా



గిరి రైతులతో ఆందోళన చేస్తున్న ఏపీ గిరిజన సంఘం సభ్యులు

మాడుగుల: రైతులు పండించే జీడిపంటకు మద్దతు ధర పెంచి, రైతు సేవా కేంద్రాల ద్వారా జీడిపిక్కలను కొనుగోలు చేయాలని ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొండపీధి గ్రామంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇ. నర్సింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకురాలు కె. భవానీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జీడిపంటకు మద్దతు ధర లేక దళారుల చేతిలో దోపిడీకి గురై నష్టపోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా వాణిజ్య పంటలకు మద్దతు ధర ప్రకటిస్తున్నా, జీడిపంటకు ప్రకటించలేదని వాపోయారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి జీడిబోర్డును ఏర్పాటు చెయ్యాలని, జీడి పిక్కలను రైతు సేవా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సోలం పెదప్పారావు, తలుపులురాజు, గడబరి కొండమ్మ, గడబరి పూజ, సోలం రాజులమ్మ పాల్గొన్నారు.

పీవీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

దళిత, బహుజన నాయకులు డిమాండ్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత, బహుజనులు



మాట్లాడుతున్న దేవరాపల్లి మండల అంబేడ్కర్ ఆశయ సాధన సమితి సభ్యులు

నర్సీపట్నం: ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్‌ను ప్రభుత్వం తక్షణమే ఎత్తివేయాలని ఏఐఎం జిల్లా కోకన్వీనర్ సాల్మన్ రాజు డిమాండ్ చేశారు. డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో దళిత, బహుజన నాయకులు స్థానిక అబిద్ సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేసారు. ఆయన మాట్లాడుతూ డీజీపీ రేసులో ఉన్న పీవీ సునీల్‌కుమార్‌ను ఉద్దేశపూర్వకంగానే కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. చిట్ల అప్పారావు మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్‌ను కావాలనే వేధింపులకు గురి చేస్తుందన్నారు. బహుజన ఐక్యవేదిక నాయకులు బొట్టా నాగరాజు, నాయకులు జువ్వల వరహాలబాబు, సరమండ వీరబాబు, రావాడ ప్రకాష్, సంజీవ్, అల్లంపల్లి ఈశ్వరరావు, చవల నాగేశ్వరరావు, చిరంజీవి, బోదారపు అప్పారావు, పాడి బాలరాజు, నూకరాజు పాల్గొన్నారు.

దేవరాపల్లి: ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేయాలని మండల అంబేడ్కర్ ఆశయ సాధన సమితి కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం దేవరాపల్లిలో మండల సమితి అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు, కార్యదర్శి పతివాడ నాగభూషణం, మండల కమిటీ సభ్యులు ఉల్లి పరశురాం, ఉల్లి సింహాద్రి, దండ పైడయ్య, యు.చంద్రశేఖర్ నిరసన తెలిపారు.

ఘనంగా సీతారాముల ఆలయ వార్షికోత్సవం

రావికమతం: మండలంలోని కొమిరలో సీతారాముల ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం చిత్ర విచిత్రమైన నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: కోవ్వూరులో మూడు రోజులపాటు నిర్వహించిన గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా శని, ఆదివారాలు గ్రామ యువకులు పగటి వేశాలు ప్రదర్శించగా, రాత్రిళ్లు గ్రామ వీధుల్లో స్టేజీ ప్రోగ్రాంలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను గ్రామ వీధుల్లో పలు పలు నేలడ్యాన్సులు, మేళతాళాలతో పల్లకిపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వై.రాజారావు సర్పంచ్ కాంతమ్మ శివపార్వతులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.